క్లుప్తంగా

సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు కొంగు బంగారంగా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనం నైవేద్యం సమర్పించారు. అనంతరం సామూహిక సత్యానారాయణస్వామి వ్రతాలు ఆచరించి, భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్ రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు బంద్ చేయాలి

బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్, మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అన్ని గ్రామాలు, డివిజన్‌లలో బెల్టు షాపులు బంద్ చేయించేలా అందరం కలిసి పార్టీల కతీతంగా పోరాడుదామని బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్, మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. మంగళవారం బాలాపూర్‌లో బెల్టు షాపులు బంద్ విషయంపై అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. వైన్ షాపుల నిర్వహణకు ప్రభుత్వం కొంత సమయం కేటాయించిందని, కానీ బెల్టు షాపులు 24 గంటలు పనిచేస్తున్నాయన్నారు. కూలీనే నమ్ముకున్న కుటుంబాలు, రెక్కాడితే కడుపు నిండని కుటుంబాలు తాగుడుకు బానిసై ఆనారోగ్యాల బారిన పడి రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, పలు రాజకీయ పార్టీల నాయకులు కలిసికట్టుగా పోరాడి బెల్టు షాపులు లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. అలాగే గంజాయిని కూడా లేకుండా పారదోలాలన్నారు.

అభినందన



కృతికను అభినందిస్తున్న మాజీ కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: ఇటీవల వెలువడిన గ్రూప్–1 పరీక్షల రిజల్ట్‌లో సరూర్‌నగర్ మండల మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య, బీరప్ప దంపతుల కూతురు సిద్దాల కృతిక స్టేట్ 5 ర్యాంకు సాధించింది. విషయం తెలుసుకున్న కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు రాళ్లగూడం సంతోషిశ్రీనివాస్‌రెడ్డి, గౌర శ్రీనివాస్ తదితరులు మంగళవారం జిల్లెలగూడలోని వారి నివాసానికి వెళ్లి కృతికను ఘనంగా సన్మానించారు. తల్లితండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గట్టు బాలకృష్ణ, గౌర కిషోర్, బొల్లంపల్లి కుమార్, సి.రవికుమార్, గౌర సాయికుమార్ తదితరులు ఉన్నారు.

రాములోరి కల్యాణానికి ఆహ్వానం



మాజీ కార్పొరేటర్ మనోహర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో గల ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 6న జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి రావాలని మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ బండారు మనోహర్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. సీతారాముల కల్యాణం అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు భారీగా తరలివచ్చి కల్యాణ ఘట్టాలను తిలకించాలని కోరారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు ఎం.విజయ్‌కుమార్‌యాదవ్, ఆత్మానంద్, ఈశ్వర్, శివానంద్‌జ్యోతి తదితరులు ఉన్నారు.

'ఆర్‌వైవీ'కి దరఖాస్తు చేసుకోండి

తుక్కుగూడ: రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులై, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ, ఈబీసీ అభ్యర్థులు ఈనెల 14వ తేదీలోపు ప్రజాపాలన సేవా కేంద్రంలో లేదా మ్యానువల్‌గా మున్సిపల్ కార్యాలయ పని వేళల్లో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

సన్న బియ్యం.. మురిసిన జనం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మహేశ్వరం నియోజకవర్గంలో ఉదయం నుంచే దుకాణాల వద్ద లబ్ధిదారులు క్యూ కట్టారు. దీంతో రేషన్ షాపుల వద్ద సందడి నెలకొంది. అనంతరం సన్న బియ్యం పొంది హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం బాగుందని ప్రజలు, నాయకులు హర్షించారు. ఆయా దుకాణాల్లో మొదటిరోజు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేశారు.

ఉత్సాహంగా ప్రారంభమైన బియ్యం పంపిణీ

- రేషన్ దుకాణాల వద్దకు బారులు తీరిన లబ్ధిదారులు
- హర్షం వ్యక్తం చేసిన ప్రజలు



కందుకూరులో సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

కందుకూరు మండలంలో..



బాచుపల్లిలో సన్నబియ్యం పంపిణీ

కందుకూరు: మండల పరిధిలోని మంగళవారం పలు గ్రామాల్లో రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, మాజీ వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎస్.మల్లేశ్, డైరెక్టర్లు సురేందర్, పుష్ప పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ హర్షణీయం



బడంగ్‌పేట్: బాలాపూర్ రేషన్ దుకాణం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

బడంగ్‌పేట్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రేషన్ కార్డు కలిగిన పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండడం హర్షణీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అన్ని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బండారు మనోహర్, ఎర్ర జైహింద్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బి.జంగయ్య, హైదరాబాద్ బ్యాంక్ డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి, నరహరిగౌడ్, శ్రీరాములు, ఉమేశ్, డీలర్ టేకుల శశిధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అల్మాస్‌గూడలో..

కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. అలాగే బడంగ్‌పేటలో మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, నాదర్‌గుల్‌లో యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్ బియ్యం పంపిణీ చేశారు. డీలర్ డిండు శ్రీనివాస్‌గౌడ్, బి.వెంకట్‌రెడ్డి, పి.సింహారెడ్డి, రవికుమార్, గట్టు బాలకృష్ణ, విజయ్‌కుమార్, కుమార్ ఉన్నారు.

తుక్కుగూడ మున్సిపాలిటీలో..



రావిర్యాలలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

తుక్కుగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం తుక్కుగూడ పురపాలిక వ్యాప్తంగా నాయకులు ప్రారంభించారు. వినియోగదారులకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గోగికర్ జానకీరామ్, ఆ పార్టీ నాయకులు భోద పాండురంగారెడ్డి, మద్దుల చంద్రశేఖర్ రెడ్డి, బంటు ధనంజయ్, రాజ్‌కుమార్, రంజిత్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆహార భద్రతకు పెద్దపీట



అమీర్‌పేట్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య

మహేశ్వరం: పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అమీర్‌పేట్, చిన్నతూప్ర, మాణిక్యమ్మగూడ, పెండ్యాల, దుబ్బచర్ల, పోరండ్ల గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆవుల యాదయ్య, జి.అంజయ్య ముదిరాజ్, మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమారి రాయప్ప, అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ పి.నర్సింగ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వమని మాజీ ఎంపీపీ కె.సునీతాఅంధ్యానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్వాల్ చెర్వు తండాలో రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మండంలోని మహేశ్వరం, సిరిగిరిపురం, మన్సాన్‌పల్లి, ఘట్టుపల్లి, ఎన్డీ తండా, కోళ్లపడకల్, గొల్లూరు, నాగారం, నందుపల్లి, పడమటి తండా, నాగిరెడ్డిపల్లి, కల్వకోల్, తుమ్మలూరు, మోహబ్బత్‌నగర్ గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు, రేషన్ డీలర్లు పంపిణీ చేశారు.

సన్నబియ్యంతో పేదలకు లబ్ధి



కందుకూరులో రేషన్ తీసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులు

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా సన్నబియ్యం పథకాన్ని మంగళవారం గ్రామాల్లో ప్రారంభించింది. దీంతో గ్రామాల్లో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులు నాణ్యత లేని దొడ్డు బియ్యం సరఫరాతో సరిగా తినలేక బయటి షాపుల్లో సన్నబియ్యం కొనుగోలు చేసేవారమని, ఇకపై ఆ పరిస్థితి ఉండదన్నారు. సన్న బియ్యం పథకంతో పేదలకు లబ్ధి చేకూరుతుందంటున్నారు. కాగా గ్రామాల్లో పథకం ప్రారంభం కావడంతో రేషన్ షాపులకు లబ్ధిదారులు ఉదయం నుంచే క్యూ కట్టారు. ఏ రేషన్ షాపు చూసినా లబ్ధిదారులతో కిటకిటలాడింది. ఇక ముందు రేషన్ బియ్యం పక్కదారి పట్టే అవకాశాలు లేవు.

తృప్తిగా ఉంది



ప్రభుత్వం సన్నబియ్యం పంపణీ చేయడం ఎంతో సంతృప్తి నిచ్చింది. రేషన్ షాపుల ద్వారా ఇప్పటి వరకు సరఫరా చేసిన దొడ్డు బియ్యం తినలేక, కేవలం పిండి వంటలు, ఉదయం వేళల్లో అల్పాహారానికే ఉపయోగించే వాళ్లం. బయట షాపుల్లో సన్నబియ్యం రూ.50కి పైగా పెట్టి కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఇకపై ఆ సమస్య ఉండదు.

– హీరాలాల్, కందుకూరు

5 కిలోల బియ్యం కేంద్రమే ఇస్తోంది

కార్పొరేటర్ శ్రీవాణి



రేషన్ దుకాణంలో ప్రధాని చిత్రపటం అంటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: రాష్ట్రంలో రేషన్‌దుకాణాలలో ప్రతీ ఒక్కరికి పంపిణీ చేసే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోల బియ్యం కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక కిలో మాత్రమే ఇస్తుందని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి తెలిపారు. మంగళవారం సన్నబియ్యం అందిస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రతి ఒక్క రేషన్ దుకాణంలో ఆయన చిత్రపటాన్ని పెట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు ఆమె సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న సంఘం నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు గ్రామానికి చెందిన ముదిరాజ్ యువకుడు పోలమోని కుమార్ చనిపోవడంతో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వారి కుటుంబానికి రూ.54వేల ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సంఘంలో ఎవరికీ ఆపద ఉన్నవారి కుటుంబానికి అండగా నిలిచేందుకు ముందుకు రావడం సంతోషకరమని ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిట్టల పాండుముదిరాజ్, ఢిల్లీ శ్రీధర్, సురేందర్, మధు, సుదర్శన్, ఉదయ్, శ్రీనివాస్, గణేష్, సురేష్, లక్ష్మణ్, పాండు, నాగేశ్, నరహరి, వెంకటేశ్ పలువురు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ న్యూనాగోలు, సమతాపురి, భవ్య ఆస్పత్రి ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు. 11కేవీ మమతానగర్, వెంకటరమణకాలనీ, ఆదర్శనగర్ ఫీడర్ల పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



నిరసన తెలుసుతున్న బీసీసేన నాయకులు

షాద్‌నగర్: ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరుతున్న నాయకులను అక్రమ అరెస్టులు చేసి ఉద్యమాన్ని ఆపాలని చూస్తే సహించేదిలేదని వివిధ పార్టీల నాయకులు మండిపడ్డారు. హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూముల అమ్మకాన్ని నిరసిస్తూ మంగళవారం వివిధ పార్టీల నాయకులు చేపట్టిన చలో హెచ్‌సీయూ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. బీజేపీ, సీపీఎం, బీసీసేన నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ.. సర్కారు ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే అమ్మకానికి పెట్టడం సరికాదన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో వేల కోట్ల రూపాయల అప్పులు చేసి అభివృద్ధి చేపట్టకుండా నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టి ప్రజలను మోసం చేస్తుందన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని సెంట్రల్ యూనివర్సిటీని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హెచ్‌సీయూ భూముల అమ్మకం నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూములను కాపాడటం కోసం వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు ఐక్య పోరాటాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ నాయకులు అందె బాబయ్య, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, సీపీఎం నాయకులు రాజు, శ్రీనునాయక్, ఈశ్వర్‌నాయక్, గోపాల్, బీసీసేన నాయకులు ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

పన్నుల వసూలు 78.84శాతం

- షాద్‌నగర్‌లో రూ.5.69కోట్లు, కొత్తూరులో రూ.2.40కోట్లు
- ముగిసిన ఆర్థిక సంవత్సరం



షాద్‌నగర్: గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపాలిటీల్లో భారీగా ఆస్తి పన్నులు వసూలు అయ్యాయి. పన్నుల వసూలు కోసం అధికారులు గత నెలరోజుల పాటు ఎంతో శ్రమించారు. సెలవు రోజుల్లో కూడా కార్యాలయాల్లో పన్నులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేశారు. షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా సిబ్బందిని నియమించి పన్నులు వసూలు చేశారు.

షాద్‌నగర్‌లో పన్నుల వసూలు ఇలా..

షాద్‌నగర్ మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులు ఉన్నాయి. సుమారు 70 వేలకుపైగా జనాభా ఉన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 15,933 గృహ, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఆస్తి, నల్లా పన్నులు సుమారుగా రూ.7 కోట్ల 22 లక్షల 40 వేల పన్నులు వసూలు కావాల్సి ఉండగా.. గత ఆర్థిక సంవత్సరం మార్చి 31 నాటికి రూ.5 కోట్ల 69 లక్షలకుపైగా పన్నులు వసూలు అయ్యాయి. మున్సిపాలిటీలో మొత్తం 78.84 శాతం పన్నులు వసూలు అయినట్లు అధికారులు తెలిపారు.

కొత్తూరులో 80శాతం..

కొత్తూరు మున్సిపాలిటీలో మొత్తం 13,200 జనాభా ఉన్నారు. ఇందులో 2,619 ఇళ్లు, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. అయితే వీటి నుంచి సుమారు 3కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉండగా.. రూ.2.40కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి. మొత్తం 80 శాతం పన్నులు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఇవీ బకాయిలు

పన్నులు వసూలు చేసేందుకు షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీల్లో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీల పరిధిలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ఫంక్షన్ హాళ్లు, పరిశ్రమలు, ఇళ్ల నుంచి పన్నులు వసూలు చేశారు. సెలవు రోజుల్లో కూడా కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి పన్నులను వసూలు చేశారు. అయినా గత ఆర్థిక సంవత్సరానికిగాను షాద్‌నగర్ మున్సిపాలిటీలో రూ.1.52కోట్లు, కొత్తూరులో రూ.60లక్షలు పన్నులు వసూలు కావాల్సి ఉంది.

రూ.5.69 కోట్లు వసూలు చేశాం



గత ఆర్థిక సంవత్సరం మార్చి 31నాటికి 78.84శాతం పన్నులు వసూలు చేశాం. మొత్తం రూ.7.22కోట్లకుగాను రూ.5.69 కోట్లు వసూలు అయ్యాయి.

– సునీత, కమిషనర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ

హెచ్‌సీయూ భూముల వేలం నిలిపివేయాలి

మీర్‌పేట: హెచ్‌సీయూలోని భూముల విషయంలో ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఎం, సీపీఐ బాలాపూర్ మండల నాయకులు దాసరి బాబు, అయోధ్య వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ఆందోళనకు పిలుపునిచ్చిన సందర్భంగా మంగళవారం వామపక్ష నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ప్రభుత్వం ఆపలేదని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల వేలంను నిలిపివేయాలని, లేకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

రాజీవ్ యువ వికాసం గడువు పొడిగింపు

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం అర్హులైన యువకుల నుంచి దరఖాస్తులను కోరింది. గడువు ఈ నెల 4తో ముగియనుండగా.. తాజాగా ప్రభుత్వం 14వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ వెంకయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల కోసం మండల కేంద్రంలో, మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, వాటిలో నేరుగా వెళ్లి దరఖాస్తులు అందించాలని కోరారు.

కేసీఆర్ బాటలోనే రేవంత్ ప్రభుత్వం

- హెచ్‌సీయూ భూముల ఆక్రమణను నిలిపివేయాలి
- సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్



మొయినాబాద్: పోలీస్ స్టేషన్ వద్ద సీపీఐ నాయకుడు



కేశంపేట: పోలీసుల అదుపులో ఉన్న నాయకులు

మొయినాబాద్: అక్రమ అరెస్టులు, పోలీసుల దాడులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల ఆక్రమణపై విద్యార్థుల నిరసనల సందర్భంగా సీపీఐ నాయకులను మంగళవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌ను ఉదయం 6 గంటలకే ఇంటి వద్ద అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూముల ఆక్రమణను నిరసిస్తూ ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హెచ్‌సీయూకి సంబంధించిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తుందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కోవడమంటే పేద విద్యార్థుల చదువులను ధ్వంసం చేయడమేనని మండిపడ్డారు. భూముల అమ్మకం విషయంలో కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి వెళ్తున్నారని విమర్శించారు. భూముల అమ్మకాలు, అక్రమ అరెస్టులపై కాకుండా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి పెట్టాలన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

కేశంపేట: హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూముల విషయంపై వివిధ పార్టీల నాయకులు చలో హెచ్‌సీయూకి పిలుపునివ్వడంతో మండల బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం ఉచిత హామీలను ఇచ్చిందని అందుకోసమే హెచ్‌సీయూ భూములను అమ్మకానికి పెట్టిందన్నారు. యూనివర్సిటీ భూముల దగ్గరికి రాష్ట్ర ప్రభుత్వం వస్తే బీజేపీ విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తుందన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని నిర్బంధాలను చేస్తూ ఉద్యమాలను ఆపలేరన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షులు నర్సింహాయాదవ్, రఘురాంగౌడ్, మహేశ్, నర్సింలు, నర్సింహ, విఠల్‌గౌడ్, శ్రీనివాస్, శివాజీ, పాండు, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.